# ప్రేమించడానికి బలం

# (3:14-21)

ప్రార్థనలలో నీవు గొప్ప సంగతులను అడుగుతావా? ప్రార్థనను గూర్చి ఈ ఆలోచనలను ఇ. ఎమ్. బౌండ్స్ యిచ్చాడు: “భూలోకంలోగాని పరలోకంలోగాని, కాలం కొరకుగాని లేక నిత్యత్వంకొరకుగాని దేవుని కుమారుడు మనకొరకు సంపాదించనిది - భద్రము చేయనిది ఏదీలేదు. ... ధైర్యంగా కృపాసనము వద్దకు రమ్మని దేవుడు మనకు ఆదేశిస్తున్నాడు. గొప్పవి అడగడంవలన దేవుడు మహిమపరచబడతాడు క్రీస్తు ఘనపరచ బడతాడు.”[1] “గొప్పవాటిని అడగడంవలన” మీ స్థాయికి కుటుంబము దేవుని మహిమ పరచుతుందా, క్రీస్తును ఘనపరచుతుందా?

గొప్ప విషయాలకొరకు ప్రార్థించడమంటే పౌలుకు తెలుసు. 3:14-21లో, ఎఫెసులో ఉన్న స్థానిక సంఘము, క్రీస్తు శరీరంకొరకు అతడు ప్రార్థించాడు. అంతకంటె ఎక్కువగా ఒక స్థానిక సంఘాన్ని గూర్చి అతడింకా ఏమి ప్రార్థించగలడు? “గొప్పవాటిని అడగడం”వలన అది దేవుని మహిమపరచింది, క్రీస్తు ప్రభువును ఘనపరచింది.

> ఈ హేతువుచేత పరలోకమందును, భూమిమీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రినిబట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రియెదుట నేను మోకాళ్లూని మీరు అంతరంగ పురుషునియందు శక్తిగలిగి ఆయన **ఆత్మ**వలన బలపరచబడు నట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగాను, తన మహిమైశ్వర్యముచొప్పున మీకు దయచేయవలెననియు, మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరుపారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను. మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక. ఆమేన్ (3:14-21).

ఈ ప్రార్థనను మనం పరిశీలించేటప్పుడు, మూడు ముఖ్యమైన పాఠాలను మనం నేర్చుకుంటాం.

## ఇతరులను ప్రేమించడానికి దేవుడు శక్తిని ప్రసాదిస్తాడు

పౌలు మనస్సులో క్రీస్తు శరీరముంది. దేవుడు కోరినంతగా క్రీస్తు శరీరం రూపొందాలని అతడు కోరుతున్నాడు. బలమైన, ఏకమైయున్న, ప్రేమించే స్థానిక సంఘాన్ని

గూర్చి అతడు కలలు కంటున్నాడు.

ఇది జరగాలంటే ఏమి కావలసి వస్తుంది? దానికి దేవుని శక్తి కావాలి. పౌలు యొక్క ప్రార్థన అది. 16వ వచనంలో అతడిలా అంటున్నాడు: “మీరు అంతరంగ పురుషునియందు శక్తికలిగి ఆయన **ఆత్మ**వలన బలపరచబడునట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగాను, తన మహిమైశ్వర్యముచొప్పున మీకు దయచేయవలెననియు ...” (3:16, 17).

స్థానిక సంఘానికి అత్యంత గొప్ప అవసరమేమైయుంది? అన్నిటికంటెను అధికంగా స్థానిక సంఘానికి ఏమి కావలసి వస్తుంది? “మాకు కావలసింది క్రొత్త బిల్డింగ్” అని ఎవరైనా అనవచ్చు. “మా పరిచర్యలలో ఎక్కువ మంది పాల్గొన నవసరముంది” అని మరొకరు అనవచ్చు. “మాకు తక్కువ సణుగుడు, ఫిర్యాదులు చేయడం అవసరం” అని యింకను కొందరు అనవచ్చు.

అన్నిటికంటెను ఎక్కువగా ఏమి అవసరమైయుందో క్రైస్తవులు చూడాలని పౌలు కోరుకుంటున్నాడు – దేవుని బలము, శక్తిని కలిగి ఉండాలి. మన జీవితాలలో ఈ శక్తి ప్రార్థనతో ఆరంభమౌతుంది. స్థానిక సంఘం దేవుని ఆనందింప జేయాలంటే, దానికి దైవికమైన శక్తి కావాలి. పౌలుకు ఈ సంగతి తెలుసు. అతడు ఎంత గాఢంగా దానికొరకు ప్రార్థించాడంటే, అది అతన్ని అక్షరార్థంగా మోకాళ్లమీదికి దించింది.

శక్తి ప్రార్థనతో ఆరంభమౌతుంది కాని, ఈ శక్తి ఎక్కడ పని చేస్తుంది? దేవుని శక్తి పని చేసేది. “అంతరంగ పురుషునియందని” 16వ వచనం అంటుంది. క్రైస్తవ ఆలోచనలకు, కార్యాలకు, ఉద్దేశాలకు, మనోభావాలకు కంట్రోల్ రూమ్‌గా “అంతరంగ పురుషుడు” ఉంటాడు. ఈ కంట్రోల్ రూమ్ సరిగా నడవాలంటే దానికి దేవుని బలం అవసరమైయుంటుంది.

నాకు లేప్‌టాప్ కంప్యూటరుంది. కనీసం కొంతసేపైనా అది బ్యాటరీమీద నడుస్తుంది. ఒక పాయింట్ వద్ద, చిన్న పచ్చ లైట్ ఆరిపోతుంది, బీ అంటూ శబ్దం రానారంభిస్తుంది. అంటే శక్తి దాదాపుగా అయిపోయినట్టే. నేను కంప్యూటరును వాడుకోవాలని ఉద్దేశిస్తే, ఎక్కడనుండైనాగాని దానికి ఎక్కువైన శక్తిని సరఫరా చేయించాలి, గత్యంతరంలేదు.

ఆత్మ సంబంధమైన బ్యాటరీవలన నీవు పని చేయడం లేదు, అంతరంగంలో కొద్ది శక్తి మాత్రమే లభ్యమౌతుంది. నీవు దీన్ని చదువుతూ ఉండగా, నీ జీవితంలో పచ్చ లైట్ కాంతివంతంగా ప్రకాశించుతూ ఉండవచ్చు. అంతరంగపు శక్తి కావలసినంత సరఫరా చేయబడుతూ ఉండవచ్చు. మరోవైపు తక్కినవారి అవసరతలు అక్కరల విషయాలను ప్రక్కనపెట్టి నీవు తక్కువ స్థాయిలో, ఆత్మ సంబంధమైన శక్తి దాదాపుగా లేని స్థితిలోనికి చేరియుండవచ్చు.

క్యాన్సర్‌తో తాను పోరాడుతున్న అది దుఃఖ దినాల్లో రాండీ బెక్టన్ – తక్కువ శక్తిలో అది భౌతికమైన బలం మాత్రమే కాదు, మానసికంగాను ఆత్మ సంబంధంగాను శక్తిలో తక్కువవాడుగా ఉన్నాడు. తన బలం యొక్క మూలాన్ని దేవునియందు అతడు కనుగొన్నాడు. “గనుక దేవా నాకు సహాయము చేయుము” అనే పేరుతో అతడు దాన్ని వివరించాడు.

బాధ అధిగమించిపోతుంది
భరించగలిగిన దానికంటే
నీవు లేకుంటే.
ఆయాసము మరియు భయము
నేను జయింపగలవాటికంటె మించియున్నాయి
నీవు లేకుంటే.
నా కంటి చూపు కొట్టుకుంటున్న
కొవ్వు వత్తివలె ఉంది
మరియు అది చీకటిగా ఉంది
నీవు లేకుంటే.
నేను ఒప్పుకుంటున్నా
చచ్చేంతగా నేను భయపడుతున్నా
నీవు లేకుంటే.
విశ్వాసానికి నాకు వేరే ఆధారాలు లేవు
నీవు లేకుంటే,
గనుక, దేవా, సహాయమిమ్ము
ఒక్కసారి ఒక్క అడుగు వేయడానికి
నీతో.
నీవు మాత్రమే నా నిరీక్షణయైయున్నావు![2]

దేవుని బలము (శక్తి) మనకు కావలసినది "అంతరంగ పురుషునియందు."

పౌలు ప్రార్థననుండి యింకో విషయాన్ని గమనించు. దేవుడు తన శక్తిని మనకు దయచేసే దాని ఉద్దేశం 17వ వచనంలో కన్పిస్తుంది: "క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగాను ..." "నివసించుట" అనేది రెండు గ్రీకు పదాలనుండి తర్జుమా చేయబడవచ్చు. అందులో ఒకటి, తాత్కాలికంగా ఒక స్థలంలో నివసించడం. రెండవ గ్రీకు పదానికి "స్థిర నివాసం ఏర్పరచుకొనడం." హోటల్ రూముకును యింటికిని ఉన్న వ్యత్యాసము లాంటిది ఆ రెండింటి మధ్య ఉంటుంది. ఒక దానిలో తాత్కాలికంగా ఉండవచ్చు; కాని రెండవదానిలో నిజంగా జీవిస్తూ ఉంటాం. ఈ లేఖన భాగంలో పౌలు రెండవ పదాన్ని (గ్రీకు.: *katoikeo*) ఉపయోగించాడు. స్థిర నివాసిగా అనే భావం అతని మనస్సులో ఉంది.

వారి హృదయములను ప్రభువైన యేసు యింటిగా చేసికొనునట్లు ఆ స్థానిక సంఘముపై దేవుడు తన శక్తిని కుమ్మరించునట్లు వారి పక్షంగా పౌలు ప్రార్థించాడు. క్రీస్తు ప్రభువు మన హృదయాలలో అతిథిగా ఉండగోరడు. స్థిరనివాసిగా ఉండాలని ఆయన కోరుకుంటాడు.

యేసు మన హృదయాలలో నివసిస్తున్నాడని మనకు ఎలా తెలుసు? ఆయన మనలో నివసిస్తూ, స్థానిక సంఘంలో ఆయన ఉంటాడనేదానికి సూచన ఏమి? దేవుని శక్తి నిజంగా ఒక స్థానిక సంఘంలో నిలిచియుంటే, అక్కడున్న క్రైస్తవుల మధ్య గాఢమైన ప్రేమ వసిస్తుంది. మనము "ప్రేమయందు వేరుపారి స్థిరపడి"యుంటాం. సంఘంలోని ప్రేమ ప్రభువు యొక్క ప్రసన్నతను సూచిస్తుంది. ఈ సూత్రం తిరిగి వల్లించ యోగ్యమైయుంది: సంఘంలోని ప్రేమ ప్రభువు యొక్క ఉనికిని సూచిస్తుంది.

స్థానిక సంఘంలోని ప్రేమ యొక్క ప్రాముఖ్యతను గూర్చి సహోదరుడు విల్లార్డ్ టాటే నొక్కి చెప్పాడు:

> సెమినార్ కొరకు డల్లాస్‌కు ఉత్తర దిశగా ఒక చిన్న పట్టణానికి వెళ్లడం జ్ఞాపకం ఉంది. ... అయితే సంఘం ఎక్కడ కూడేది నాకు సరిగ్గా తెలియదు. గనుక నేను ఒక స్టోరు వద్ద ఆపి, ఒక రాతివేత దూరంలో ఆ బిల్డింగ్ ఉంది తన కారులో పెట్రోలు పోయించుకొనే ఒకనిని, చర్చి బిల్డింగ్ యిక్కడ ఉండాలి నీకేమైనా తెలుసా? అని అతనిని అడిగాను.
>
> "నాకు తెలియదని" అతడు బదులిచ్చాడు.
>
> తరువాత నేను లోపలికి వెళ్లి ఆ స్టేషన్ సొంతగానిని అడిగాను. సంఘాన్ని గూర్చి అతనికి కూడా తెలియలేదు. మేము ఫోన్ బుక్‌లో దానికొరకు చూచాం!
>
> వీరిలో ఎవరును సంఘానికి వ్యతిరేకులు కారు. అయితే అది అక్కడ ఉన్న విషయం వారికి తెలియలేదు! ...
>
> విషాదకరంగా, నాకు ఈలాటి అనుభవం ఒకటికంటె ఎక్కువ సార్లే తటస్థించింది. అయితే నేను ఏమి వినగోరుకున్నానో నీకు తెలుసా? "ఒక చిన్న గుంపు అదిగో ఆ కొండమీద కూడతారు. వారేమైయున్నారో, లేక వారు తమను తాము ఏమని పిలుచుకుంటారో నాకు తెలియదు, కాని నీ జీవితంలో నీ వెన్నడు చూడనంతగా ప్రేమించుకునే ప్రజలైయున్నారు. వారు ఒకరికొకరు ప్రేమ చూపుకుంటారు, మరియు వారు యితరుల అవసరతలను తీర్చడానికి వెళ్లతారు కూడా. నీవు వారి విషయం తెలిసికొని వారెవరో కనుక్కో" అని వారు చెప్పితే వినాలని కోరాను.[3]

స్థానిక సంఘంలోని ప్రేమ ప్రభువు యొక్క ప్రసన్నతను సూచిస్తుంది. ఒకరినొకరు ప్రేమించుకొనడానికి స్థానిక సంఘంలో దేవుడు బలాన్ని సరఫరా చేస్తాడు.

## క్రీస్తు ప్రేమను గ్రహించడానికి దేవుడు బలాన్ని ప్రసాదిస్తాడు

క్రీస్తు ప్రేమ యొక్క మహా విశాలతను గూర్చి క్రైస్తవులు ఎరిగియుండాలని పౌలు కోరాడు:

> ... ప్రేమయందు వేరుపారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును, తగిన శక్తిగలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను (3:17-19).

నీవు సముద్ర తీరాన ఎప్పుడైనా నిలబడ్డావా? నీవు గ్రాండ్ కేనియన్‌కు ఎప్పుడైనా వెళ్లావా? స్కూలులో పిల్లలు ఉపయోగించే ప్లాస్టిక్ స్కేలును తీసికొని పసిఫిక్ మహా సముద్రాన్ని కొలువ ప్రయత్నించినట్టు ఊహించితే ఎంత దూరం ఉంటుంది? గ్రాండ్ కానియన్‌లోని ప్రతి అంగుళాన్ని కొలువ ప్రయత్నించితే ఎంత కాలం పట్టుతుంది. అది ఎంత కాలము ఎంత ప్రయాస తీసుకుంటుందో, నీ పక్షంగా క్రీస్తుకున్న ప్రేమను కొలతవేయడానికి అయ్యే సమయానికి, ప్రయాసకు పోల్చడానికి కూడా సరిపోదు.

"యేసు నన్ను ప్రేమిస్తాడు! ఇది నాకు తెలుసు" అని చిన్న పిల్లల పాట ఒకటుంది.

దాన్ని గ్రహించడానికి దేవుని శక్తి మనకు అనుగ్రహింపబడకుంటే, యేసు ఎంతగా ప్రేమిస్తాడో మనం ఎరుగలేం.

క్రీస్తు ప్రేమ యొక్క వెడల్పు ఎంతో గ్రహించడానికి దేవుడనుగ్రహించే శక్తి మనకు అవసరమౌతుంది. మానవ జాతినంతటిని – ప్రతి పురుషుని – స్త్రీని, బాలుని, బాలికను లోకములో ఉన్న అందరిని ఆయన ప్రేమ ఆవరించియుంటుంది. ఆయన నిన్ను నీ పేరును బట్టి ఎరుగు. ఆయన ఎల్లప్పుడు ఎరిగేయున్నాడు. నీ ముఖాన్ని ఆయన ఎరుగు. నీ నవ్వు యొక్క శబ్దాన్ని ప్రభువు గుర్తుపట్టగలడు. ఇతరుల వద్దనుండి నీవు దాచే కీడులను ఆయన ఎరుగు. ఆయన మనస్సులో నాటునట్టుగా నీవు తంటాలు పడనవసరం లేదు. ఆయన నిన్ను యిష్టపడుతున్నాడా లేదా అనడానికి నీవు ఏ రాత్రి నిద్రను పోగొట్టుకొని బాధపడనవసరం లేదు. ఆయన నిన్ను ప్రేమిస్తున్నాడు.

క్రీస్తు ప్రేమ యొక్క పొడుగును గ్రహించడానికి దేవుని వద్దనుండి శక్తి నీకు అవసరం. ఆయన ప్రేమ నిత్యత్వంనుండి నిత్యత్వంవరకు చేరుకుంటుంది. నీవు జన్మింపక ముందే ఆయన నిన్ను ప్రేమించాడు. ఎవరు నిన్ను ప్రేమించేదానికంటెను మిన్నగా ఆయన నిన్ను ఈ క్షణమందే ప్రేమిస్తున్నాడు. ఆయన నిన్ను నిరంతరం ప్రేమిస్తునే ఉంటాడు. ఆయన పట్ల నీకు ప్రేమ లేనట్టు నీవు ప్రవర్తించినా, ఆయన యింకను నిన్ను ప్రేమిస్తున్నాడు. నిన్ను ప్రేమించకుండ క్రీస్తును ఆపగలిగేది ఏదియు లేదు.

అంతములేని, బంధకాల కలయిక లేని ప్రేమను మనం అర్థం చేసికొనడానికి ఈ లోకం కష్టతరంగా చేస్తుంది. మనకు తెలిసినదంతా – షరత్తులతో కూడిన ప్రేమయే. "ఎంతవరకైతే అంతవరకే" ప్రేమించడం అనేదే మనకు తెలుసు: వారు ఎదురు చూచినవాటిని మనం నెరవేర్చునంత మట్టుకే జనులు మనలను ప్రేమిస్తారు. ప్రభువైన యేసు అయితే – షరత్తులులేని ప్రేమతో – "ఎన్నడు నిలిపివేయని ప్రేమతో – మనలను ప్రేమిస్తాడు."

క్రీస్తు ప్రేమ యొక్క ఎత్తును గ్రహించడానికి దేవుని శక్తి కావలసియుంటుంది. ఆయన పరలోకంలో తండ్రి వద్ద ఉన్నాడు. అక్కడే మనము ఉండాలని ఆయన కోరుతున్నాడు. ఆయన ప్రేమ ఎంత ఎత్తుకు చేరిందంటే – అంతకంటె ఏ తక్కువకు మనలను స్థిరపడవద్దని కోరుతుంది. అపవాది మాత్రం దానికి భిన్నంగా కోరుతున్నాడు. మన దుస్తులలో, ఉద్యోగాల్లో, ఆటల్లో, పాటల్లో ఎంతగా మునిగియుండాలని కోరుతున్నాడంటే – పరలోకము, నిత్య జీవము, సంపూర్ణ ఆనందము, సమాధానము, మనకొరకు సిద్ధపరచ బడిన నివాసాన్ని సహితం, మరియు పరలోకపు తండ్రితో ఉండే యితర సదవకాశాలను కూడా పోగొట్టాలని వాడు ప్రయత్నిస్తాడు.

క్రీస్తు ప్రేమ యొక్క లోతును గ్రహించడానికి దేవుని శక్తి అవసరమైయుంటుంది. అది ఎంత లోతైనదంటే, పరలోకానికి వీడ్కోలు పలికి, నరుడై పశువుల పాకలో ఆయనను జన్మించేలా దించింది. అది ఎంత లోతైనదంటే, యేసు యిష్టపూర్వకంగా సిలువపై మృతినొందేలా చేసింది. అది ఎంత లోతైనదంటే మన పాపములన్నిటిని సిలువలో తన శరీరమందు మోసికొనేలా చేసింది. అది ఎంత లోతైనదంటే, ఆయనను సమాధిలోనుండి వెలుపలికి తెచ్చి – సజీవునిగాను మన రక్షకునిగాను ప్రభువుగాను అది నిలిపింది.

ఇది నా సిద్ధాంతం: మన కొరకైన తన ప్రేమచే ముంచి తేల్చబడి దాని నిజత్వం యొక్క భయభక్తులు కలిగినవారమైయుంటే మాత్రం, మన జీవితాలు మార్పు చెందుతాయి. క్రీస్తు ప్రేమను గ్రహించియుండియు ప్రజలను అమర్యాదగా చూడ వీలుకాదు. క్రీస్తు ప్రేమను మనం గ్రహించియుండియు దాన్ని సీసాల్లో బిగించి ఉంచలేం. అది యితరులకు ప్రవహించాలి. క్రీస్తు ప్రేమను గ్రహించియుండి యితరుల పట్ల నిర్దయగా ప్రవర్తించలేం, ఒకని పడద్రోయలేం ఎందుకంటే ఆ వ్యక్తిని ఆయన ఎంతగా ప్రేమిస్తున్నాడో మనం ఎరుగుదుము.

క్రీస్తు ప్రేమను గ్రహించి ఆయనను స్తుతించి, పూజించి ఘనపరచకుండ ఉండలేం. క్రీస్తు ప్రేమను గ్రహించి ఆయనను సేవింపగోరకుండ, మనకు చేతనైన ప్రతి విధానంలో ఆయనను మహిమపరచకుండ ఉండలేం.

క్రీస్తు ప్రేమను గ్రహించడానికి కావలసిన బలం మనలోనుండి పుట్టుకొని రాదని మనం గుర్తుంచుకోవాలి. మనం మన మోకాళ్లమీద ఒరిగి దానికొరకు ప్రార్థించాలి. దాన్ని గ్రహించగల శక్తిని దేవుడు మాత్రమే ప్రసాదిస్తాడు. దేవుని శక్తి మీ స్థానిక సంఘంలో ప్రవహించునట్టు ప్రార్థించు. దేవుడు కోరిన విధంగా వారు ఒకరినొకరు ప్రేమించుకొన గలుగునట్లు ప్రార్థించు. క్రీస్తు ప్రభువు యొక్క అద్భుతమైన ప్రేమ నీవును మీ స్థానిక సంఘంలో వారందరును యింతక మునుపు ఎన్నడూ లేని విధంగా గ్రహించ గలుగునట్టు ప్రార్థించు. ప్రత్యేకించి సంఘంలో ఒక మనిషిని తీసికొని అతని కొరకు కొంతసేపు ప్రార్థించు. ఆమె లేక అతని జీవితంలో దేవుని శక్తి కొరకు ప్రార్థించు. తరువాత ఆ విషయం ఆ వ్యక్తికి తెలుపు. నీ ప్రార్థనను గూర్చి ఆమెకు లేక అతనికి తెలియజేయి.

## దేవుని సంపూర్ణతతో నింపబడునట్లు
## దేవుడు మనకు శక్తినిస్తాడు

"జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెననియు" స్థానిక సంఘంకొరకు పౌలు ప్రార్థించాడు. ఎందుకు? 19వ వచనం దానికి కారణమిస్తుంది: "దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా ..." చేయవచ్చు.

తన కుటుంబంనుండి తనను తానే దూరం చేసికొన్న ఒక మనిషిని గూర్చి జె. విల్‌బర్న్ చాంప్‌మన్ తెలియజేస్తూ ఉంటాడు. తాను కోరుకున్న జీవితం అతన్ని నాశనం చేసింది. చినిగిపోయిన దుస్తులలో అతడు తిరుగుతూ, జీవించడానికి అతడు అడుక్కొని తిననారంభించాడు. ఒక రోజున రైల్ స్టేషన్‌లో భిక్షమడుగుతున్నాడు. ప్రయాణికుడు బండి దిగినతోడనే, భిక్షగాడు అతని భుజం మీద తట్టాడు.

"అయ్యా, నాకు ఒక రూపాయి యిస్తారా? ఒక రూపాయి మాత్రమే?"

ప్రయాణికుడు వెనుకకు తిరిగాడు, భిక్షగాడు చెయ్యి చాపాడు. ప్రయాణికుని ముఖంలోనికి ఆ భిక్షగాడు చూచాడు ... అతడు దాని చూచినప్పుడు, దిగ్భ్రమతో అతని ముఖం వెలవెలబోయింది. ఆ ప్రయాణికుడు అతని తండ్రియే. అతడు వానిని సంవత్సరాలుగా చూడలేదు.

"నాయనా, నేనెవరినో నీకు తెలుసా?" అని అతడు అడిగాడు.

ఆ తండ్రి తన కుమారుని కౌగలించుకున్నాడు. తన చెక్కెళ్లమీదుగా కన్నీళ్లు రాలాయి. "కుమారుడా, నిన్ను కనుగొన్నాను. ఈ సంవత్సరాలన్నీ గతించిన మీదట నిన్ను కనుగొన్నాను. నీకు ఒక రూపాయి కావాలా? నాకు కలిగినదంతా నీదే"యని ప్రయాణికుడు ఆ భిక్షగానితో అన్నాడు.[4]

మనలో ఎంత మందిమి ఆ భిక్షగానివలె ఉన్నాం? పరలోక సంబంధమైన ఐశ్వర్యాన్ని మనపై కుమ్మరించాలని మన పరలోకపు తండ్రి కోరుతున్నప్పుడు, మనం ఆయనను రూపాయలు అడుగుతాం. శుక్రవారంనాడు సినిమా చూస్తే, క్రొత్త బట్ట కొనడానికి షాపుకు వెళ్లితే, లేక చివరిగా ఉద్యోగంలో ప్రమోషన్ వస్తే మన జీవితాలకు సుఖం కలిగినట్టు భావిస్తాం. రెస్టారెంట్ పార్టీలో ఒక రాత్రి స్నేహితులతో గడపడం చాలునని భావిస్తాం. ముప్పై సంవత్సరాలకు పైగా ఉద్యోగం చేసి, పని విరమణ అయిన తరువాత, మనం కోరినదాన్ని చేయడానికి కొద్ది సంవత్సరాలు చాలుననుకుంటాం. "దేవుని సంపూర్ణతచేత" మనం నింపబడాలని మన తండ్రి కోరుతూ ఉండగా, రూపాయలకే మనం స్థిరపడాలని అనుకుంటాం.

"మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా" అంటే ఏమి? అది క్రీస్తువలె ఉండడం – ఆయన మనస్సు కలిగియుండడం; ఆయన ఆలోచనలు కలిగియుండడం; ఆయన ప్రవర్తించినట్టు ప్రవర్తించడం; ఆయనకున్న దయ కలిగియుండడం, ఆయన ప్రేమ, దేవుని చిత్తంపట్ల ఆయన సమర్పణ కలిగియుండడం. తన తండ్రియందు ఆయనకున్న నమ్మికను మనం కూడా కలిగియుండడం అని భావం. జీవితంకొరకు ఆయనకున్న శ్రద్ధ, ఆయన సంతోషము, ఆయన మంచితనం కలిగియుండడమని భావం. తండ్రిని స్తుతించి ఘనపరచడంలో క్రీస్తు ప్రభువుకు ఉన్నంత భావన కలిగియుండడమని అర్థం. అదీ జీవితం.

## ముగింపు

ప్రతి స్థానిక సంఘము ఆయన శక్తిని అనుభవించాలని దేవుడు కోరుకుంటున్నాడు. క్రైస్తవులు ఒకరినొకరు ప్రేమించుకునే బలంగలవారై ఉండేలా స్థానిక సంఘాలు ఉండాలని, ప్రభువు మనపట్ల కలిగియున్న ప్రేమను కలిగియుండాలని, క్రీస్తువలె ఉండే శక్తి వారికి కావలసియున్నట్టు స్థానిక సంఘాలు తెలిసికోవాలని ఆయన కోరుతున్నాడు.

జనులను ప్రేమించడంలో నీవు సతమతమౌతుంటే, లేక యేసు ఎంతగా ప్రేమించాడనే భావాన్ని గ్రహించడం నీకు కష్టంగా ఉంటే, ఆరంభించవలసిన చోటు ప్రార్థన. ప్రభువైన యేసువలె ఉండడానికి నీవు తడబడుతూ ఉంటే, అది ప్రార్థించవలసిన సమయమైయుంది.

ఆలాటి ప్రార్థనలకు ఆయన జవాబులతో దేవుడు నిన్ను ఆశ్చర్యపరచుతాడు.

> మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి, క్రీస్తుయేసు

మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక. ఆమేన్ (3:20, 21).

సూచనలు

[1]E. M. Bounds, quoted in Jack Taylor, *Prayer: Life's Limitless Reach* (Nashville, Tenn.: Broadman Press, 1977), 15. [2]Randy Becton, *Coming to Grips With God* (Abilene, Tex.: Randy Becton, 1977), 111. [3]Willard Tate, *Learning to Love* (Nashville, Tenn.: Gospel Advocate Co., 1988), 77. [4]Adapted from Max Anders, *The Good Life: Living With Meaning in a "Never-Enough" World* (Dallas: Word Publishing, 1993), 78-79.

---

## ప్రేమ

"సంపూర్తిగా దుబారాగా ఖర్చు చేసిన లాభం వచ్చే వ్యాపారం ప్రేమ ఒక్కటే. ఇచ్చివేయి, దాన్ని పారవేయి, మీద చల్లు, నీ జేబులను ఖాళీ చేయి, గంపలను దులిపివేయి; ఎప్పటికంటె ఎక్కువగా నీకు సమకూడుతుంది."

"ప్రేమ ఏదో ఒకరికి పరిచర్య చేయ తీసికొనిన తీర్మానమైయుంది."

డోనాల్డ్ ఇ. విట్నీ

"ప్రేమలో మనం పరిచర్య చేయక మునుపు, ప్రేమచే మనం ఆధీనం చేయబడతాం."

"అధికారపు ప్రేమతో జీవితపు నెరవేర్పు కాదు కాని ప్రేమ యొక్క శక్తిని బట్టి అవుతుంది."

"ఆలోచన, ఉద్దేశము, లాజిక్, కృషి – ప్రేమ యొక్క ప్రకాశం లేకుంటే; అది సాతాను యొక్క సరియైన వర్ణన కాదా?"

విలియమ్ ఎల్. సుల్లివన్

"ప్రేమ యితరుల యొక్క లోపాల మీద గస్తీ త్రొక్కదు లేక వారి బలహీనతలను బట్టి జనులను వేదించదు. కాని యితరులను అర్థం చేసికొనడానికి ప్రేమ వెదకుతుంది – వారి లోపాలను, బలహీనతలను."